నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
10 | మహబూబ్‌నగర్, మంగళవారం 10 జూన్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

బడుగులే.. సమిధలు

కలెక్టరేట్ వద్ద అఖిలపక్షం నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న పెద్దధన్వాడ గ్రామస్తులు

- ఖద్దరు ఆదేశాలు.. అమాయకులపై కేసులు
- ఎఫ్ఐఆర్‌లో ఘటనకు సంబంధంలేని వారి పేర్లు
- ఖాకీలకు భయపడి ఊళ్లల్లోకి రాని రైతులు
- వ్యవసాయం ఊపందుకుంటున్న వేళ కర్షకుల్లో టెన్షన్
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు
- పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ జీవో రద్దు చేయిస్తానన్న పాలకుల అడ్రస్ గల్లంతు

గద్వాల, జూన్ 9 : పచ్చని పొలాలను నాశనం చేసే ఇథనాల్ ఫ్యాక్టరీ మాకొద్దని ఆందోళన చేసిన ఘటనలో బడుగు, బక్కచిక్కిన రైతులే సమిధలయ్యారు. పచ్చని పల్లెల్లో చిచ్చుపెట్టే ఈ ఫ్యాక్టరిని ఎట్టిపరిస్థితుల్లో రానివ్వమని దాని జీవోలు రద్దు చేయించే వరకు పోరాడతామని చెప్పిన పాలకులు అడ్రస్ లేకుండా పోయారు. ఇథనాల్ ఫ్యాక్టరికి వ్యతిరేకంగా శాంతియుత రిలే నిరాహార దీక్షలు చేపట్టిన రైతుల వద్దకు అధికార, ప్రతి పక్ష నాయకులు వచ్చి తీయని మాటలు చెప్పి దీక్షలు విరవింప చేసిన నాయకులు, ఫ్యాక్టరీ పనులు కంపెనీ యాజమాన్యం ప్రారంభించే సమయంలో దానిని నిలువరించే ప్రయత్నం చేయలేదు. ప్రజా ప్రతినిధులను నమ్ముకున్న గ్రామస్తులు వారు పట్టించుకోకపోవడంతో విధి లేని పరిస్థితిలో పోరుబాట పట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఫ్యాక్టరీ వద్దని ఆందోళన చేసిన 40మంది బక్కరైతులపై కక్ష కట్టి ఖాకీలు 17సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. 12మందిని జైలుకు పంపి ఫ్యాక్టరీ జోలికి వస్తే మిగితా వారికి ఇదే గతి పడుతుందనే హెచ్చరికలు జారీ చేస్తున్నారు పోలీసులు. అయినా ప్రాణాలు పణంగా పెట్టి ఫ్యాక్టరీ నిర్మాణం అడ్డుకుంటామని ఊరంతా ఏకమై కంపెనీ యాజమాన్యం పనులు చేయకుండా అడ్డుకున్నది. అడ్డుకున్న వారిని అరెస్ట్ చేసి నేటికి ఐదు రోజులు కావస్తున్నా వారి గురించి పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ప్రజా ప్రతినిధులు తీరుపై గ్రామస్తులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ గోడు వెల్లబోసుకున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో పాల్గొనని వారిపై కేసులు

నాకు వ్యతిరేకంగా మాట్లాడుతారా నాకు వ్యతిరేకంగా మాట్లాడితే ఎటువంటి పరిస్థితులు ఎదుర్కొంటారో చూడండి అని ఆ మాజీ ఎమ్మెల్యే బడుగు రైతులు, యువకులపై ఖాకీలతో కేసులు నమోదు చేయించి తమ ప్రతాపం చూయించడంతోపాటు ఆందోళనలో లేని వారిపై కూడా కేసులు నమోదు చేయడంలో కీలకపాత్ర పోషించారు. అందుకు ఆగ్రహించిన పెద్దధన్వాడ గ్రామస్తులు సోమవారం కలెక్టర్ సంతోష్‌ను కలిసి ఆందోళనలో లేని వారిపై రాజోళి ఎస్సై కేసులు నమోదు చేశాడని విచారణ జరిపి వారిపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రాజోళి ఎస్సై ఓ మాజీ ప్రజాప్రతినిధి మాటలు విని పత్రిక ఎడిటర్, అసిస్టెంట్ జైలర్, టీచర్‌పై కేసులు నమోదు చేయడాన్ని గ్రామస్తులు ఖండిస్తున్నారు. ఆందోళన జరిగిన సమయంలో వారు అక్కడ లేక పోవడం మాజీ ఎమ్మెల్యే కక్ష పూరితంగా వారిపై కేసులు నమోదు చేయించి చిట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఆందోళనలో లేని వారిపై కేసులు నమోదు చేయడం వారు మానవహక్కుల సంఘాన్ని ఆశ్రయించడంతో ప్రస్తుతం పోలీసులకు ఏమి చేయాలో తోచడం లేదు..

పోలీసులకు భయపడి గ్రామాల్లోకి రాని రైతులు

ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఏరువాక వస్తున్న ఈ తరుణంలో రైతులు విత్తనాలు విత్తు కోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో ఆందోళనలో పాల్గొన్న రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు చేసుకోవడానికి వస్తే పోలీసులు ఎక్కడ అరెస్ట్ చేస్తారోనని భయపడి రైతులు గ్రామాల్లోకి రాకుండా ఉంటున్నారు. ఒక వేళ వస్తే అరెస్ట్ చేస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని అటువంటి సమయంలో తాము విత్తనాలు విత్తు కోవడానికి ఆలస్యమవుతుందని భావించి రైతులు భయంతో గ్రామాల్లోకి రావడం లేదు. దీంతో పాటు ఇథనాల్ ఫ్యాక్టరికి వ్యతిరేకంగా పోరాడిన గ్రామాల చుట్టూ పోలీస్ అధికారులు నిఘా ఉంచడంతో రైతులు గ్రామాల్లోకి రావడం లేదు. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి అరెస్టులు ఇంతటితో ఆపాలని పెద్దధన్వాడ గ్రామస్తులతోపాటు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

రాజోళి ఎస్సై ఆందోళనలో పాల్గొనని రైతులు, యువకులు, ఉద్యోగులపై తప్పుడు కేసులు నమోదు చేశాడని విచారణ జరిపి తప్పుడు కేసులు నమోదు చేసిన రాజోళి ఎస్సైపై శాఖ పరమైన చర్యలు తీసుకొని అక్కడి నుంచి అతనిని బదిలీ చేయాలని సోమవారం పెద్దధన్వాడ గ్రామస్తులతో పాటు అఖిల పక్షం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనతో సంబంధం లేని జనం సాక్షి ఎడిటర్ ముజిబూర్ రెహమాన్, నాగర్‌కర్నూల్ సబ్‌జైలర్ నాగరాజు, ప్రభుత్వ ఉద్యోగి కేఎంఎస్ శ్రావణ్‌కుమార్‌తోపాటు తన చెల్లిని తీసుకరావడానికి వెళ్తున్న మనోహర్, తన బిడ్డకు కల్యాణ లక్ష్మికోసం బోనఫైడ్ తేవడానికి వెళ్తున్న లక్ష్మన్న, గాయాలు తగిలిన మహిళను దవాఖాన తీసుకెళ్తున్న నర్సింహులు, భరత్‌కుమార్, సూర్యప్రకాశ్ ఇలా చాలా మంది ఆందోళనలో పాల్గొనని వారిపై మాజీ ఎమ్మెల్యే ప్రోద్బలంతో ఎస్సై తప్పుడు కేసులు నమోదు చేశారని వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిపై కూడా 17సెక్షన్ల కింద కేసులు నమోదు చేయలేదు.. కాని ఇప్పుడు ఆందోళనలో పాల్గొన్న వారిపై ఇన్ని కేసులు పోలీసులు నమోదు చేయడం రాజకీయ ప్రోద్బలమే అని గ్రామస్తులు, అఖిల పక్షం నాయకులు ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఫ్యాక్టరీ యాజమాన్యం యుద్ధ వాతావరణం కల్పించేలా రాత్రికి రాత్రే ఫ్యాక్టరీ పనులు చేపట్టడానికి పూనుకోవడంతో ప్రజలు ఆందోళన చెంది ఫ్యాక్టరీకి సంబంధించి ఆస్తులు ధ్వంసం చేశారు..తప్పా ప్రజలు ఉద్దేశ్య పూర్వకంగా చేయలేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలను రెచ్చగొట్టడంలో ఎస్సై ప్రధాన పాత్ర పోషించడని వారు కలెక్టర్‌కు చెప్పారు.

ఫ్యాక్టరీ మాకు అవసరం లేదు

ప్రస్తుతం మా పొలాల్లో మంచి పంటలు పండుతున్నాయి. పంటలు పండే పొలాల వద్ద ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే దాని వల్ల మా పంటలు నాశనమయ్యే అవకాశం ఉంది. పంటలు పండక పోతే మేము ఎలా బతకాలి, బంగారు పంటలు పండే పొలాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలసలు పోవాలా. 12గ్రామాల ప్రజలు ఫ్యాక్టరి వద్దంటే ఒక్కరి కోసం అధికారులు, పోలీసులు ఎందుకు ఆరాట పడుతున్నారు. ప్రాణాలు పోయినా సరే ఫ్యాక్టరీ నిర్మాణం అడ్డుకుంటాం.

- రాములమ్మ, పెద్ద ధన్వాడ, జోగులాంబ గద్వాల జిల్లా

నాకొడుకు ప్రమేయం లేదు

ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దని ప్రజలు, రైతులు చేసిన ఆందోళనలో నా కొడుకు పాల్గొనలేదు. అయినా ఓ ప్రజాప్రతినిధి ఆదేశంతో రాజోళి ఎస్సై నాకొడుకుపై తప్పుడు కేసు నమోదు చేశాడు. పోలీసులు కక్షసాధింపు చర్యలు మానుకోవాలి. ప్రజలు, రైతులు ఫ్యాక్టరీ వద్దంటే బలవంతంగా ఎలా ఏర్పాటు చేస్తారు. నాకొడుకు నిర్దోషి. తప్పుడు కేసు నమోదు చేసిన రాజోళి ఎస్సై చర్యలు తీసుకోవాలి. మమ్మల్ని వేధింపులకు గురిచేస్తున్న ఎస్సైపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తాం.

-నాగేంద్రం, జైలర్ నాగరాజు తండ్రి, పెద్దధన్వాడ, జోగులాంబ గద్వాల

చెల్లిని తీసుకొస్తుంటే అరెస్ట్ చేశారు

ఆందోళనకు నా కొడుకుకు ఎటువంటి సంబంధం లేదు. తన చెల్లిని ఊరి నుంచి తీసుకరావడానికి బైక్‌పై వెళ్తుంటే పోలీసులు అరెస్ట్ చేసి డీసీఎం ఎక్కించారు. ఇలా నా కొడుకు లాంటి అమాయకులైన చాలా మంది యువకులపై పోలీసులు లాఠీ చార్జి చేయడం తోపాటు కేసులు నమోదు చేశారు. తప్పుడు కేసులు నమోదు చేసిన రాజోళి ఎస్సైపై చర్యలు తీసుకోవాలి.

-మరియమ్మ, మనోహర్ తల్లి, పెద్దధన్వాడ, జోగులాంబ గద్వాల

టీబీ ఇన్‌ఫ్లో @ 6 వేల క్యూసెక్కులు

అయిజ, జూన్ 9 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు టీబీ డ్యాంకు వరద కొనసాగుతోంది. సోమవారం టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 6,020 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 213 క్యూసెక్కులు ఉంది. గరిష్ఠ నీటిమట్టం1633అడుగులకు గానూ ప్రస్తుతం 1601.69 అడుగుల నీటి మట్టం ఉండగా, 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 23.786 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద తగ్గుముఖం పట్టింది. ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోగా, కన్‌స్ట్రక్షన్ స్లూయిస్ ద్వారా దిగువన ఉన్న సుంకేసుల బారాజ్‌కు 209 క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 159 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 6.5 అడుగుల మేర నీటిమట్టం ఉంది.

ఇందిరమ్మా.. ఇదేందమ్మా..?

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దీక్షలో కూర్చున్న యువకుడు

- తుర్కలపల్లిలో అర్హులకు అందని ఇండ్లు
- జీపీ ఎదుట నిరాహార దీక్ష చేపట్టిన యువకుడు

చారకొండ, జూన్ 9 : తనకు సెంటు భూమిలేదు.. రేకుల ఇల్లు మాత్రమే ఉంది.. ఇందిరమ్మ ఇంటికి అర్హుడినైనా తనకు ఇవ్వడం లేదని, ఇందిరమ్మా ఇదేమి రాజ్యమమ్మా అంటూ ఓ యువకుడు దీక్ష చేపట్టిన ఘటన చారకొండ మండలం తుర్కలపల్లిలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన మహేశ్ పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేపట్టాడు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ గ్రామంలో అధికారులు నిజమైనట లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం లేదని, చాలా మంది పేదలకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట్లో అర్హత జాబితాలో తన పేరు వచ్చినా ఫైనల్ జాబితాల్లో మాయం చేశారని ఆరోపించారు. తన తండ్రి 17ఏండ్ల కిందటే పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యాడని, కలెక్టర్, ఎమ్మెల్యే గుర్తించి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

చిన్నారులను మింగిన నీటిగుంత

- పొలం వద్ద జారి అన్నదమ్ములు మృతి
- బొమ్మనపల్లిలో విషాదం

చిన్నారుల మృతదేహాల వద్ద రోధిస్తున్న బంధువులు

అచ్చంపేట రూరల్, జూన్ 9 : వ్యవసాయం పొలంలో ఏర్పాటు చేసుకున్న నీటి నిల్వ చేసే కవర్ గుంతలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు (అన్నదమ్ములు) ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందిన ఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కుంభం ధరణి, సుధాకర్ దంపతుల కొడుకులు ఆశ్విత్‌కుమార్(8), చేతన్(6) తల్లిదండ్రుల వెంట పొలంలో పత్తి విత్తనాలు నాటేందుకు వెళ్లారు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తుండగా పక్క పొలంలో నీటి నిల్వ గుంతలో ప్రమాదవశాత్తు చిన్న కుమారుడు చేతన్ పడిపోగా వాడిని కాపాడేందుకు ప్రయత్నించి ఆశ్విత్‌కుమార్ కూడా గుంతలో పడిపోయాడు. వారిని ఎవరూ గమనించక పోవడంతో మృతిచెందారు. చాలా సేపటికి పిల్లలు కనిపించడంలేదని తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో వెతకగా పక్క పొలంలో నీటిగుంతలో విగత జీవులుగా పడి ఉండడాన్ని చూసి బోరున విలపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సిద్ధాపూర్ ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో అచ్చంపేట దవాఖానకు మృతదేహాలను తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ నాయకులు, మాజీ సర్పంచ్ బోడ్కనాయక్, మాజీ ఎంపీపీ మేడేమోని పర్వతాలు, రామనాథం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అద్దె చెల్లించడం లేదని..

- అమరచింత ఎంపీడీవో ఆఫీస్‌కు తాళం వేసిన ఇంటి యజమాని
- గంటసేపు అధికారుల పడిగాపులు
- త్వరలో చెల్లిస్తామని హామీ
- తాళం తీసిన బిల్డింగ్ ఓనర్

అద్దె డబ్బుల కోసం ఎంపీడీవో కార్యాలయానికి వేసిన తాళం

అమరచింత, జూన్ 9 : అద్దె డబ్బులు మూడున్నర ఏండ్లుగా చెల్లించడం లేదని భవన యజమాని ఎంపీడీవో కార్యాలయ భవనానికి తాళం వేసిన ఘటన సోమవారం వనపర్తి జిల్లాలో చోటు చేసుకున్నది. ఆయన కథనం ప్రకారం.. అమరచింత ఎంపీడీవో కార్యాలయాన్ని మండల కేంద్రానికి చెందిన సురేందర్ అనే వ్యక్తికి చెందిన భవనంలో నిర్వహిస్తున్నారు. నెలకు రూ.14 వేల అద్దె ఉండగా.. మూడున్నర ఏండ్లుగా కిరాయి డబ్బులు చెల్లించడం లేదు. దీంతో ఇప్పటి వరకు రూ.3.50 లక్షలు బకాయి పడింది. దీంతో చేసేది లేక యజమాని సురేందర్, అతడి భార్య భాగ్యమ్మ, పిల్లలతో కలిసి సోమవారం ఉదయం కార్యాలయం తెరవక ముందే చేరుకొని మరో తాళం వేశారు. దీంతో విధులకు హాజరైన ఎంపీడీవో చెన్నమ్మతోపాటు ఉద్యోగులు ఆరు బయటే పడిగాపులు కాశారు. చివరకు ఇంటి యజమానితో ఎంపీడీవో మాట్లాడి త్వరగా డబ్బులు చెల్లిస్తామని హామీ గంట సేపటి తర్వాత ఇవ్వడంతో వేసిన తాళం తీశారు.

తెలంగాణ ఉద్యమకారుడు మృతి

వినోద్ (ఫైల్)

మహబూబ్‌నగర్, జూన్ 9 : తెలంగాణ ఉద్యమకారుడు మొల్గర వినోద్ అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని హనుమాన్ పుర్‌లో నివాసం ఉంటున్న వినోద్(45) బీఆర్ఎస్ పార్టీలో పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. కొన్నినెలల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఉండగానే తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రశ్నించడం ద్వారానే మన హక్కులు సాధించుకోవచ్చని, పిలుపునిచ్చి తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రత్యేక భూమిక పోషించారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు వినోద్ మృతి పలువురిని దిగ్భ్రాంతికి గురి చేయడం తోపాటు పాలమూరులో విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, పలువురు రాజకీయ నాయకులు, పాలమూరు యూనివర్సిటీ అధికారులు ఆయన మృతికి నివాళులర్పించారు. వినోద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఓపెన్ వివాదం

కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

- కల్వకుర్తి ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో జిమ్‌కు శంకుస్థాపన
- కుచించుకుపోతున్న ఆట స్థలం
- పాఠశాల ఉనికికే ప్రమాదం
- విద్యాభిమానుల ఆందోళన
- ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ సమితి సభ్యుల ఆగ్రహం
- మౌఖికంగా అనుమతులున్నాయి : మున్సిపల్ కమిషనర్

కల్వకుర్తి, జూన్ 9 : కల్వకుర్తి పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఓపెన్ జిమ్‌కు చేసిన శంకుస్థాపన వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. పాఠశాల ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో విద్యార్థుల విద్యా భ్యాసానికి అటంకం కలగడమే కాకుండా, విద్యార్థులకు ఆటస్థలం కుచించుకు పోతుందని విద్యా భిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తామని ప్రభుత్వాలు చెబుతూ.. మరో పక్క పాఠశాల ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడమేమిటనే ప్రశ్నలు విని పిస్తున్నాయి. ఓపెన్ జిమ్ ఏర్పాటు వల్ల అతి ప్రాచీన చరిత్ర కలిగిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల చరిత్ర క్రమక్రమంగా కనుమరుగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని విద్యా భిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొప్ప చరిత్ర కలిగిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చాలా గొప్ప చరిత్ర ఉంది. దేశానికి స్వాతంత్రం రాక ముందే ఈ భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో ఉదయం పాఠశాల, మధ్యాహ్నం జూనియర్ కళాశాల కొనసాగింది. ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పింది. కాలక్రమేణా పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంలో ఇదే మైదానంలో పాఠశాల, కళాశాలకు వేర్వేరు భవనాలు నిర్మించారు. ఇప్పుడు ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల వేర్వేరు భవనాల్లో కొనసాగుతున్నాయి. రెండింటిని విభజిస్తూ గోడను కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఉన్నత పాఠశాలకు మైదానం కుచించుకు పోయింది. ఉన్న స్థలంలోనే విద్యార్థులు క్రీడలు ఆడుతున్నారు.

ఉన్నత పాఠశాల మైదానంలో శంకుస్థాపన

ఈనెల 5వ తేదీన ఉన్నత పాఠశాల మైదానంలో రూ.10లక్షల అంచనా వ్యయంతో నిరించనున్న ఓపెన్ జిమ్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అప్పుడు కళాశాలకు చెందిన హెచ్ఎం, అధ్యాపకులు జిమ్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు. విద్యార్థులు విద్యాభ్యాసానికి, క్రీడలకు ఆటంకం కలుగుతుందని, జిమ్ ఏర్పాటు వల్ల పాఠశాలలోని మౌలిక వసతులు నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాఠశాలకు రక్షణ లేకపోవడం వల్ల మూత్రశాలలను పాడుచేస్తున్నారని, పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారని, ఇక్కడ జిమ్ ఏర్పాటు చేస్తే పాఠశాల ఉనికికే ప్రమాదం సంభవిస్తుందని చెప్పినా పట్టించుకోకుండా జిమ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ సమితి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీఈవో నుంచి మౌఖిక అనుమతులు..

ప్రభుత్వ పాఠశాలల్లో చిన్న చెట్టును తీసివేయాలన్నా..పాతసామాన్లు తొలగించాలన్నా..చివరకు శిథిల భవనాన్ని కూల్చివేయాలన్న ఆ శాఖ ఉన్నతాధికారులు అనుమతి తప్పని సరి. ఆలాంటిది పాఠశాల ఆవరణలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతుంది. ఇదే విషయాన్ని ఎంఈవో శంకర్ నాయక్‌ను అడిగితే సెలవులో ఉన్నానని ఈ విషయం గురించి తెలియదని సమాధానం ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్‌కు అడిగితే డీఈవో మౌఖికంగా అనుమతి ఇచ్చారని చెప్పారు. జిమ్ ఏర్పాటు చేసుకోవచ్చని డీఈవో నుంచి ఏదైన ప్రొసిడింగ్ ఉందా అని అడిగితే అలాంటిదేమి లేదని కమిషనర్ సమాధానం ఇచ్చారు.

ఒకటి రెండు చోట్ల తప్పా..

కల్వకుర్తి పట్టణంలో 10 వరకు ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. ఇందులో రెండు మూడు తప్పా మిగిలిన జిమ్‌లు పెద్దగా ఉపయోగంలో లేవు. వీటికి నిర్వహణ లోపించడం వల్ల ఆదరణ కరువైంది. ఇటువంటి పరిస్థితుల్లో ఉన్న జిమ్‌లకు మౌలిక వసతులు కల్పించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాకుండా కొత్తగా అది ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేయడమేమిటని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. జిమ్‌ల ఏర్పాటు కాంట్రాక్టర్‌కు ఉపయోగం తప్పా..మరేమి ఉండదని పట్టణవాసులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిమ్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నత పాఠశాల మైదానంలో జిమ్ ఏర్పాటుకు వేసిన శంకుస్థాపన శిలాఫలకం

పీయూలో టీజీ పీఈసెట్

- రేపటి నుంచి ప్రవేశాలకు సామర్థ్య పరీక్షలు
- రాష్ట్రవ్యాప్తంగా 17 కళాశాలల్లో నిర్వహణ
- వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్

మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్, చిత్రంలో రిజిస్ట్రార్, సెట్ కన్వీనర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 9 : తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీఎస్‌సీహెచ్ఈ) ఆధ్వర్యంలో పాలమూరు విశ్వవిద్యాలయం తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (టీజీపీఈసెట్)-2025ను ఈ నెల 11వ తేదీ నుంచి పాలమూరు యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహిస్తారని పీయూ వైస్‌చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పీయూ అడ్మిన్ బిల్డింగ్ సమావేశ మందిరంలో పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, సెట్ కన్వీనర్ దిలీప్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ మాట్లాడారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలకు మాత్రమే సెట్‌ల నిర్వహణ అరుదుగా లభిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 కళాశాలల్లో ప్రవేశాలకు గానూ ఈనెల 11వ తేదీ నుంచి 14వరకు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్-2025 పీయూ క్యాంపస్‌లో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు వెల్లడించారు. బీపెడ్, డీఎడ్ కోర్సుల్లో ప్రవేశం కోసం రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వివిధ విభాగాల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకంగా తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (టీజీపీఈసెట్) నిర్వహించడంతో యూనివర్సిటీ ప్రతిష్ట మరింత పెరగనున్నదన్నారు. ప్రభుత్వం రానున్న రోజుల్లో మరిన్ని సెట్‌ల నిర్వహణ బాధ్యతలు యూనివర్సిటీకి అప్పగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అభ్యర్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య రమేశ్‌బాబు, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్‌కుమార్, పీయూ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, పీయూ పీఆర్వో శేకుంటి రవికుమార్ పాల్గొన్నారు.